
సాక్షి
గుంటూరు

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



జిల్లా ఎస్పీని కలిసిన జేసీ

నగరంపాలెం: జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ శనివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఇరువురు బాధ్యతలు స్వీకరించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 5527 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2120 క్యూసెక్కులు విడుదల చేశారు.

బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: పరిశా వారిపాలెం శివారులో 300 లీటర్లు, అదవల గ్రామ శివారు పాలరేవులో 600 లీటర్ల బెల్లం ఊట గుర్తించి ధ్వంసం చేసినట్టు నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ప్రసాద్ తెలిపారు.

సీఎం అండతోనే అర్ధరాత్రి దాడి



అంబేడ్కర్ స్మృతివనంలో శిలాఫలకంపై దాడికి నిరసనగా చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా , డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తదితరులు

- అంబేడ్కర్ స్మృతివనంలో శిలాఫలకం ధ్వంసం
- రాజ్యాంగ నిర్మాతను అపహాస్యం చేసిన టీడీపీ
- వైఎస్ జగన్ పేరు యథాతథంగా పెట్టేవరకు ఉద్యమం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండదండలతోనే విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఉన్న శిలాఫలకాన్ని అర్ధరాత్రి ధ్వంసం చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. వై.ఎస్.జగన్ పేరు ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శంకర్‌విలాస్ సెంటర్‌లో ప్రారంభమైన ఈ ప్రదర్శన అరండల్‌పేట పోలీసు స్టేషన్ మీదుగా లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైఎస్ జగన్‌కు ఆదరణ తగ్గించలేరు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహంపై ఉన్న వై.ఎస్.జగన్ పేరును దుర్మార్గంగా తొలగించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. శిలాఫలకంపై ఉన్న వై.ఎస్.జగన్ పేరును పగులగొట్టినా ప్రజల్లో ఆయనకున్న ఆదరణను ఏమాత్రం తగ్గించలేరని తెలిపారు.

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ.. స్మృతివనం ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. స్పష్టంగా ప్రభుత్వం సమర్థించడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు.

కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు మేకతోటి దయాసాగర్, నిమ్మకాయల రాజనారాయణ, మందేపూడి పురుషోత్తం, బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అంబేడ్కర్, ధూపాటి వంశీ, పలు అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా, నగర కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం కొనసాగిస్తాం

మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ... స్మృతివనంలో జరిగిన చర్య కేవలం వై.ఎస్.జగన్ పేరు తొలగించినట్లు భావించడం లేదని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అపహాస్యం చేసేలా టీడీపీ దుండగులు వ్యవహరించిన చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశామని గుర్తుచేశారు. దుండగులు టీడీపీ, కూటమి వారు కావడంతో ఇక చర్యలు ఏముంటాయని ప్రశ్నించారు. ఇలాగైతే వై.ఎస్.జగన్ పేరు ఎక్కడ ఉంటే అక్కడ తొలగించేలా ప్రభుత్వం ఒక జీవో తెచ్చుకోవాలని విమర్శించారు. ఎక్కడైతే వై.ఎస్.జగన్ పేరు తొలగించారో.. అక్కడ తిరిగి యథాతథంగా పెట్టే వరకు ఉద్యమం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తెనాలి త్యాగం.. రగిలిన రణం!

స్వతంత్ర పోరులో 'తెనాలి' తెగువ ఆనాటి ప్రజల్లో స్వేచ్ఛా కాంక్షను మరింత రగిల్చింది. ఉద్యమ స్ఫూర్తిని చాటేలా చేసింది. ఆంగ్లేయులకు దడ పుట్టించిన పోరుగడ్డగా తెనాలి అవతరించింది. ఏడుగురి ప్రాణ త్యాగంతో తెగించి సమరభేరి మోగించేలా ప్రజల్లో చైతన్యం నింపింది. బానిస సంకెళ్లను తెంచాలనే కాంక్షను మరింత పెంచింది. క్విట్ ఇండియా స్ఫూర్తితో తెనాలిలో పడిన పోరు అడుగు... బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించింది. బ్రిటిష్ పార్లమెంటును సైతం తాకిన ఇక్కడి పోరాటం 'తెనాలి ఎక్కడ?..' అని ఏకంగా చర్చిల్ ఆరా తీసేలా చేసింది.

- క్విట్ ఇండియా పోరులో ప్రాణాలొదిలిన ఏడుగురు ప్రముఖులు
- చర్చిల్‌నే ప్రపంచ పటంలో చిరునామా వెతికేలా చేసిన ఉద్యమం
- రేపు పట్టణంలో వీర సంస్మరణ దినం నిర్వహణకు ఏర్పాట్లు

తెనాలి: భారత స్వాతంత్య్ర పోరాట చరిత్రలో తెనాలి కీలకపాత్ర పోషించింది. 'డూ ఆర్ డై' పేరుతో సాగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఇక్కడ జరిగిన పోరాటం బ్రిటిష్ పార్లమెంటును సైతం భయపెట్టింది. ప్రపంచ పటంలో తెనాలి ఎక్కడ..? అంటూ చర్చిల్ సైతం ఆరా తీశారు. పట్టణవాసులపై సామూహిక జరిమానా విధించి, నానా అగచాట్లకు గురిచేశారు. 1942 ఆగస్టు 8న ముంబయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో గాంధీజీ చేసిన ప్రసంగం 'క్విట్ ఇండియా' తీర్మానానికి దారితీసింది. ఆ వెంటనే దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌వాదులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ముంబయి సమావేశంలో పాల్గొన్న కల్లూరి చంద్రమౌళి, వెలువోలు సీతారామయ్య, పుతుంబాక శ్రీరాములు, అవుతు సుబ్బారెడ్డి, శరణు రామస్వామి తెనాలి తిరిగొచ్చారు. 11వ తేదీన నాటి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (వెర్రెయ్య గారి మేడ)లో కార్యకర్తలకు ఏఐసీసీ కార్యాచరణను వివరించారు. మరుసటిరోజున పట్టణ బంద్‌కు నిర్ణయించారు. తాలూకా హైస్కూలు, భారత్ ట్యుటోరియల్ కాలేజీ విద్యార్థులు, కొత్తమాసు మోహనరావు, కోగంటి వెంకట్రామయ్య, దాచేపల్లి సుబ్బారావు, కొల్లి ప్రసాద్ ప్రోత్సాహంతో పాఠశాలలను బహిష్కరించి, సంపూర్ణ బంద్ నిర్వహించాలని తలపెట్టారు.


రైల్వేస్టేషన్‌పై ప్రజల ఆగ్రహజ్వాల

ఆగస్టు 12న ఉదయం కాంగ్రెస్ వలంటీర్లు, విద్యార్థులు జట్లుగా బయలుదేరి బంద్ తీరును పర్యవేక్షించసాగారు. రైల్వేస్టేషను ఫలహారశాల నడుస్తున్న విషయం తెలిసి, అక్కడకు చేరుకున్నారు. మూసివేయటం కుదరదని మేనేజరు చెప్పటంతో దాడి చేశారు. స్పెన్సరు క్యాంటీనులో మద్యం సీసాలను పగులగొట్టారు. గుంటూరు రైలు బయలుదేరటంతో సిగ్నల్‌పోస్టును ధ్వంసం చేశారు. డ్రైవరుపై రాళ్ల వర్షం కురిపించారు. ఉత్తరం వైపు క్యాబిన్ దగ్గర్లోని ఆయిల్ ట్యాంకుకు నిప్పుపెట్టారు. చెన్నై ప్యాసింజరు రైలు నాలుగు బోగీలను తగులబెట్టారు. స్టేషన్‌ను దహనం చేశారు. ఈ సంఘటనలు విద్యార్థి ఉద్యమాల నుంచి రూపుదిద్దుకున్నాయి. విద్యార్థుల కోసం తాలూకా హైస్కూలుకు వెళ్లిన పోలీసులను ప్రధానోపాధ్యాయుడు జొన్నగలగడ్డ శివసుందరం గేటులోనే అడ్డుకున్నారు. తనను కాల్చిన తర్వాతే లోనికి అడుగుపెట్టాలని స్పష్టంగా చెప్పటంతో వెనుదిరిగారు. ఈ ఘటనలపై ఎందరినో చిత్రహింసలు పెట్టారు. అరెస్టు చేసి కోర్టులో శిక్షలు వేశారు. తెనాలి ప్రజలపై రూ.2 లక్షల జరిమానా విధించారు. ఆ మొత్తం వసూలుకు ప్రజలను పెట్టిన బాధలు అన్నీఇన్నీ కావు.



రణరంగ చౌక్‌లోని అమరవీరుల స్తూపాలు

తుపాకీ తూటాలను సైతం లెక్కచేయక...



నీలం సంజీవరెడ్డి, కామరాజ్ నాడార్‌లను సూర్యరథంపై తీసుకొస్తున్న వెంకట్రామయ్య

కొత్తపేటలోని సబ్‌ట్రెజరీ వైపు బయలుదేరిన ప్రదర్శకులు స్టేషను రోడ్డులోంచి మలుపు తిరుగుతుండగా పోలీసులు వచ్చారు. పోలీసు గూఢచారులుగా వ్యవహరిస్తున్న అప్పట్లోని పట్టణ న్యాయవాదులు ఇరువురిని తీసుకొని డీఎస్పీ స్వయంగా అక్కడకు చేరుకున్నారు. 'చెదిరిపోకపోతే పోలీసులు కాల్పులు జరుపుతారు.. పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి' అంటూ వారితో చెప్పించారు. దీంతో ఆగ్రహించి మరింత రెచ్చిపోయిన జనం, వారినే వెళ్లిపొమ్మని హెచ్చరించారు. ఇదిలా సాగుతూ ఉండగానే జిల్లా కలెక్టర్, ఎస్పీలు రిజర్వు బలగాలతో అక్కడకు చేరుకున్నారు. పోలీసు హెచ్చరికలను లెక్కచేయని ప్రదర్శనకారులపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టారు. తూటాలకు భాస్కరుని లక్ష్మీనారాయణ, మాజేటి సుబ్బారావు, శ్రీపతి పండితారాధ్యుల శ్రీగిరిలింగం, ప్రయాగ వీరరాఘవయ్య అక్కడికక్కడే మరణించారు. గాయాలపాలై ఆస్పత్రిలో చేర్చిన వారిలో జాస్తి అప్పయ్య, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య మరణించారు. కాల్పులు విరమించాకే అందరూ తిరిగి ఇళ్లకు వెళ్లారు. ఇది జరిగిన కొద్ది గంటల్లోనే దుగ్గిరాల రైల్వేస్టేషనును తగులబెట్టారు.

స్మృతిచిహ్నంగా ఏడు స్తూపాలు



స్తూపాల వద్ద సీఎం నీలం సంజీవరెడ్డితో కాంగ్రెస్ ప్రముఖులు కన్నెగంటి రెడ్డమ్మ

పోరాటం సాగిన స్థలానికి రణరంగ్ చౌక్‌గా నామకరణం చేశారు. 1959లో మున్సిపల్ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య అమరవీరుల స్మృతి చిహ్నంగా ఏడు స్తూపాలను నిర్మించారు. అదే ఏడాది డిసెంబరు 20న అప్పటి మద్రాస్, ఏపీ ముఖ్యమంత్రులు కామరాజ్ నాడార్, నీలం సంజీవరెడ్డిని ఆహ్వానించారు. వారిని ఏడు గుర్రాలు పూన్చిన 'సూర్యరథం'పై ఊరేగింపుగా తోడ్కొని వచ్చి స్తూపాలను ఆవిష్కరింపజేశారు. తూటాలకు కుప్పకూలిన అమరవీరుడిని భరతమాత చేతుల్లోకి తీసుకున్నట్టుగా తెనాలి శిల్పి చిన్నాల రంగారావు రూపొందించిన విగ్రహాన్ని స్తూపాల ఎదుట ప్రతిష్ఠించారు. 2015 నుంచి పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 12న వీరసంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. క్విట్ ఇండియా పోరులో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటున్నారు.



విభిన్న ప్రతిభావంతులకు మెమెంటో అందజేస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్మన్, జస్టిస్ జి. నరేందర్

బాలలపై దాడులను అణచివేయాలి

- సమాజ దృక్పథంలోనూ మరింత మార్పు అవసరం
- సంబంధిత చట్టాలు, హక్కులపై విస్తృత ప్రచారం ముఖ్యం
- చిన్నారులపై అఘాయిత్యాలు కలచి వేస్తున్నాయి
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- ముగిసిన విభిన్న ప్రతిభావంత బాలల హక్కుల పరిరక్షణ కార్యక్రమం

గుంటూరు వెస్ట్: బాలలపై దాడులను కఠినంగా అణచివేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. చిన్నారుల రక్షణ కోసం రూపొందిన ఎన్నో చట్టాలపై విస్తృత ప్రచారం అవసరమని తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల హక్కుల పరిరక్షణపై స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన వార్షిక రాష్ట్ర స్థాయి సమావేశం విజయవంతంగా ముగిసింది. సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టు మొత్తం సమావేశ మందిరంలోనే ఉండడంతోపాటు ఎంతో ఆప్యాయంగా దివ్యాంగులు, చిన్నారులతో అందరూ ముచ్చటించారు. బాలలు పాడిన గీతాలను ఎంతో శ్రద్ధగా విన్నారు. ముఖ్యంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, హైకోర్టు న్యాయమూర్తులు చిన్నారులను పలకరిస్తూ, షేక్‌హ్యాండ్స్ ఇస్తూ ఉత్సాహపరిచారు. బహుమతులు కూడా అందించారు. విభిన్న ప్రతిభావంతులపై జరుగుతున్న దాడుల విషయంలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్వేగానికి లోనయ్యారు.



మెమెంటో అందజేస్తున్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ జి. నరేందర్

ప్రచారం ముమ్మరం చేయాలి

అనంతరం జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. చిన్నారుల కోసం జువెనైల్ జస్టిస్ చట్టాలు, పోక్సో, లీగల్ ప్రొవిజన్స్ తదితర అంశాలపై పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలలో ప్రచారం నిర్వహించాలన్నారు. క్రమం తప్పకుండా డిబేట్స్‌తోపాటు వార్తాపత్రికలు, ఇతర సాధనాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. మారుతున్న ఆధునిక సమాజంలో చిన్నారులపై జరిగే దాడులను కఠినంగా అణచివేయాలని వ్యాఖ్యానించారు. జాతీయ క్రైం బ్యూరో 2023 గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 1,62,000 మంది బాలలపై నేరాలు జరిగాయన్నారు. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని చెప్పారు.

శాఖల మధ్య సమన్వయం అవసరం

సమావేశంలో జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ మాట్లాడుతూ.. బాలల రక్షణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. చిన్నారుల చట్టాల అమలుకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమష్టి కృషితో కేసులను త్వరగా పరిష్కరించడంతోపాటు నేరాలు అరికట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో మార్పులకు అందరూ కృషి చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే ఈ దిశగా పని చేస్తున్నాయని అభినందించారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులైన బాలల హక్కుల పరిరక్షణతోపాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను విశదీకరించారు. కార్యక్రమంలో జువెనైల్ జస్టిస్ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.సుజాత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్య కుమారి, డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, గుంటూరు లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి టి.లీలావతి, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను

నరసరావుపేట ప్రజల దాహార్తిని తీర్చే రక్షిత నీటి చెరువు స్థలంపై అధికార పార్టీకి చెందిన ఓ నేత కన్ను పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా మున్సిపల్ అధికారులు అడ్డుకుని కంచె వేశారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో కంచెను మేసేందుకు సిద్ధమయ్యాడు ఆ నేత.

- గతంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు భూమి ఆక్రమణకు యత్నం
- అడ్డుకుని ఫెన్సింగ్ వేసిన మున్సిపల్ అధికారులు
- మళ్లీ టీడీపీ అధికారంలోకి రావటంతో మరోసారి ప్రయత్నం



భూమిలో పిచ్చిచెట్లను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: నరసరావుపేట పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకుగాను నకరికల్లు వద్ద సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మించాలని నిర్ణయించారు. అప్పటికే అక్కడ 70 నుంచి 80 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. ఆ చెరువు నీటితో గతంలో వందలాది మంది ఇటుక పరిశ్రమ నడుపుతుండగా మరికొంతమంది రైతులు ప్రభుత్వం భూమి ఆక్రమించుకుని సాగు చేసుకొని జీవనం సాగించేవారు. చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చే క్రమంలో చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని సేకరించి 260 ఎకరాలు సేకరించారు. ఇక్కడి నుంచి పట్టణానికి రెండుపూటల తాగునీటిని సరఫరా చేస్తారు. చెరువు నిర్వహణ బాధ్యత నరసరావుపేట మున్సిపాలిటీ వారు చూసుకుంటారు. దీంతో ఇటుక పరిశ్రమదారులు, రైతులు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు.

అధికారం మారడంతో..

చెరువు కట్టకు ఆనుకొని శివాపురంతండా వెళ్లే రోడ్డు పక్కన గల సుమారు రూ.50 లక్షలు విలువచేసే భూమిపై మండల స్థాయి టీడీపీ నాయకుడి కన్ను పడింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రెండున్నర ఎకరాల భూమిని ఆక్రమించి సాగుభూమిగా మలుచుకున్నాడు. మున్సిపల్ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ కంచె వేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నంతకాలం మిన్నకుండిపోయిన ఆ నాయకుడు ఇప్పుడు తిరిగి తమ పార్టీ అధికారంలోకి రావటంతో ఆక్రమించుకునేందుకు వేగంగా పావులు కదుపుతున్నాడు. పట్టపగలే పొక్లెయిన్‌తో చెట్లను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేసి అక్రమంగా సాగు చేసుకునేందుకు చకచకా పనులు చేపడుతున్నాడు.

నా దృష్టికి రాలేదు

ఈ విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. వెంటనే మా అధికారులు పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటారు.

–సి.రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగరాలి



లక్ష్మీపురం: ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా 3.0' కార్యక్రమాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఉండాలని కోరారని గుర్తుచేశారు. రూ.25కే పోస్టాఫీసులో జెండాను అందుబాటులోకి తెచ్చామన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి మాట్లాడుతూ దేశంలో పుట్టినందుకు అందరం గర్వించాలన్నారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో అధికారులతో కలిసి పెమ్మసాని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ ఏపీ సర్కిల్ జగదీష్, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆఫ్ ఏపీ సర్కిల్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి, గుంటూరు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ శివలక్ష్మి



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ బీఓఎస్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్) చైర్‌పర్సన్‌గా ఆర్‌వీఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లెక్చరర్ డాక్టర్ గంటా వెంకట శివలక్ష్మిని నియమిస్తూ ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శివలక్ష్మి ఈ హోదాలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు. తనను బీఓఎస్ చైర్ పర్సన్‌గా నియమించిన ఏఎన్‌యూ ఉన్నతాధికారులకు శివలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజ్ఞాచారికి తెలుగు భాషా పురస్కారం

ఈ నెల 18న అమలాపురంలో ప్రదానం



తెనాలిరూరల్: అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ప్రదానం చేయనున్న తెలుగు భాషా పురస్కారానికి తెనాలి మండలం కొలకలూరుకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి ఎంపికయ్యారు. ఈ నెల 18న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరగనున్న కార్యక్రమంలో పురస్కారాన్ని కళావేదిక నిర్వాహకులు ప్రదానం చేయనున్నారు. ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

రేపు 'ప్రజా సమస్య.. పరిష్కార వ్యవస్థ'

మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో సోమవారం 'ప్రజాసమస్య.. పరిష్కార వ్యవస్థ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే తగిన పరిష్కారం చూపుతారని వివరించారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెలలో సమస్య పరిష్కరిస్తాం

మేదరమెట్ల: గ్రామంలోకి కారం కోరు రాకుండా నెల రోజుల్లో తగిన పరిష్కారం చూపుతామని సింథైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులు హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండల కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు శనివారం గ్రామస్తులు, ఫ్యాక్టరీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నెల రోజుల్లో ఫ్యాక్టరీ నుంచి కారం కోరు బయటకు రాకుండా చూస్తామని ఫ్యాక్టరీ నిర్వాహకులు చెప్పినట్లు జేసీ తెలిపారు. చెప్పిన గడువు తరువాత కోరు వస్తే ఫ్యాక్టరీని మూసి వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిర్వాహకులు తెలియజేశారన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డు సమీపంలో గల సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి కొన్ని నెలలుగా కారం కోరు వస్తోందని, దీనివల్ల గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఫ్యాక్టరీ డీజీఎం మహేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలు రైళ్ల సేవల్లో మార్పులు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వేకు చెందిన గుంటూరు డివిజన్ పరిధిలో పలు ఇంజినీరింగ్ పనుల నేపథ్యంలో రైళ్ల సేవల్లో మార్పులు జరిగాయి. ప్రయాణికులు వీటిని గమనించాల్సిందిగా సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం వెల్లడించారు. మార్పుల వివరాలు..

- 17646 రేపల్లె-సికింద్రాబాద్ రైలు ఈ నెల 12,13వ తేదీలకు బదులు 13, 14వ తేదీల్లో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- 12805 విశాఖపట్నం-లింగంపల్లి రైలు ఈ నెల 12,13వ తేదీలకు బదులు ఈ నెల 13, 14వ తేదీల్లో 45 నిమిషాలపాటు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- 17230 సికింద్రాబాద్-త్రివేండ్రం సెంట్రల్ రైలు ఈ నెల 12,13, 14వ తేదీలలో 1.15 గంటలు ఆలస్యంగా బయలు దేరనుంది.
- 07221 సికింద్రాబాద్-సత్రగచీ రైలు గుంటూరు మీదుగా కాకుండా ఈ నెల 13వ తేదీన ఖాజీపేట మీదుగా ప్రయాణిస్తుంది.
- 22882 భువనేశ్వర్-పుణె రైలు విజయవాడ-గుంటూరు-సికింద్రాబాద్ మీదుగా కాకుండా వరంగల్ మీదుగా ఈ నెల 13వ తేదీన ప్రయాణిస్తుంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.7000, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.


230 కిలోల గంజాయి స్వాధీనం



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద సెబ్ పోలీసులు శనివారం రూ. 30 లక్షల విలువైన 230 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని సెబ్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా పాడేరు నుంచి చెన్నై వస్తున్న రెండు కార్లలో తరలిస్తున్న 230 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. ఐదుగురు నిందితులు వాటిలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 6 మొబైల్స్, రూ. 34 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను చెన్నైకు చెందిన అమీర్, కలైముదన్, షేక్ అబ్దుల్లా ఫరూక్, కార్తికేయన్, మల్లికార్జున్‌లుగా గుర్తించినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో గుంటూరు జిల్లా, మంగళగిరికి చెందిన సెబ్ అధికారులు పాల్గొన్నారు.

అరిగేలా.. ఆరగిద్దాం..!

- వేళాపాళా లేకుండా తినడంతో సమస్యలు
- గ్యాస్ట్రో పెరేసిస్ బారిన పడుతున్న యువత
- ఈ వ్యాధిపై అవగాహన మాసంగా ఆగస్టు
- ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పుతో ఊరట



గుంటూరు మెడికల్ : ఆధునిక జీవన శైలి వల్ల సరైన సమయానికి భోజనం చేయకపోవడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతున్నాయి. ఒత్తిడితో కూడిన జీవన శైలితో ఎక్కువ మంది మధుమేహం బారిన పడుతున్నారు. వ్యాధి నియంత్రణలో లేకపోవడంతో జీర్ణకోశ సంబంధిత సమస్యలు సైతం ఉత్పన్నం అవుతున్నాయి. వేళాపాళా లేకుండా తినడం కారణంగా అరగక గ్యాస్ట్రో పెరేసిస్ అనే వ్యాధి ఉత్పన్నం అవుతోంది. జీర్ణాశయానికి వాతం సోకడాన్నే గ్యాస్ట్రో పెరేసిస్ అంటారు. ముఖ్యంగా యువత ఈ వ్యాధి బారిన పడడం ఆందోళనకర అంశమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు పేర్కొంటున్నారు. ఆగస్టు నెలను ఈ వ్యాధిపై అవగాహన కల్పించే మాసంగా పాటిస్తుండటంతో ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

జీవనశైలిలో మార్పులు, వయస్సు పెరిగే కొద్ది గ్యాస్ట్రో పెరేసిస్ సమస్యలు వస్తున్నాయి. ఇది వచ్చిన వారికి ఆహారం తిన్న తర్వాత కడుపు ఖాళీ అవడానికి చాలా సమయం పడుతుంది. తద్వారా వికారం, వాంతులు, గుండెల్లో మంట, ఉబ్బరం, కడుపు నొప్పి, కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపించడం, ఆకలి లేకపోవడం, రక్తంలో చక్కెర స్థాయిలో మార్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. తగినంత ఆహారం తినకపోవడం వల్ల బరువు తగ్గుతారు. శరీరానికి ముఖ్యమైన పోషకాలను సైతం కోల్పోతారు.


కారణాలు

వ్యాధి రావడానికి పూర్తి కారణాలు నిర్ధారించలేదు. కొన్ని సందర్భాల్లో కడుపు కండరాలను (వాగస్ నరాలు) నియంత్రించే నరాలు దెబ్బతినడం వల్ల ఇది సోకుతుంది. వాగస్ నాడి జీర్ణ వ్యవస్థలోని సంక్లిష్టమైన కార్యకలాపాలను నియంత్రిస్తుంది. కడుపు కండరాలను సంకోచింపజేయడం, చిన్నపేగులోకి ఆహారాన్ని నెట్టడం వంటివి చేస్తుంది.

ఫైబర్ తక్కువగా తీసుకోవాలి

బాధితులకు ఫైబర్, ఫ్యాట్ తక్కువగా ఉన్న ఆహారం ఇవ్వాలి. తద్వారా మంచి ఫలితాలు వస్తాయి. తక్కువ మొత్తంలో వీలైతే రోజుకు 4 నుంచి 5 సార్లు ఆహారం తీసుకోవాలి. భోజన సమయంలో జీర్ణక్రియకు సహాయ పడేలా ద్రవపదార్థాలు తాగాలి. బ్రకోలి, క్యాబేజీ, బీన్స్, బెల్‌పెపర్స్ వంటి కూరగాయలకు దూరంగా ఉండాలి. జున్ను, క్రీమ్, వెన్న, కొవ్వు అదనంగా ఉండేవి తినకూడదు. ఆహారంలో తగ్గిన పోషకాలను భర్తీ చేసుకోవడానికి రోజూ మల్టీ విటమిన్స్ టాబ్లెట్స్ తీసుకోవాలి. భోజనం చేసిన తర్వాత సుమారు రెండు గంటలపాటు ఆగిన తర్వాతే నిద్రించాలి. ఈలోగా కొంచెం దూరం నడవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. ధూమపానం, మద్యపానం పూర్తిగా మానాలి. కార్బొనేటెడ్ డ్రింక్స్ తాగకూడదు. ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఉపయోగం ఉంటుంది.

జీవన శైలి మార్పుతో నివారించవచ్చు



జీవన శైలిలో మార్పు ద్వారా గ్యాస్ట్రో పెరేసిస్‌ను నివారించవచ్చు. మధుమేహ బాధితులు షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవాలి. ధూమపానం, మద్యపానం మానివేయాలి. ఆహారాన్ని పూర్తిగా నమిలి మింగాలి. జీర్ణక్రియను నెమ్మది చేసే జిడ్డుతో కూడిన ఆహారాన్ని తీసుకోవద్దు. రోజూ నీరు ఎక్కువగా తాగాలి.

– డాక్టర్ ఆళ్ల సిద్దార్థరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



గుంటూరు జీజీహెచ్‌లో గ్యాస్ట్రో పెరేసిస్ బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. రోజూ వివిధ రకాల జీర్ణ సంబంధిత సమస్యలతో 100- 125 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి చికిత్స కోసం వస్తున్నారు. గ్యాస్ట్రో పెరేసిస్ బాధితులు ప్రతినెలా 20 మంది ఉంటున్నారు. ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా మందులతో వ్యాధిని కట్టడి చేయవచ్చు.

– డాక్టర్ అనుమల కవిత

98 పరుగుల ఆధిక్యంలో గుంటూరు జట్టు



83 పరుగులు చేసిన కేపీ సాయి రాహుల్

మంగళగిరి: ఏసీఏ సీనియర్ మల్టీ డే ఇంటర్ జోనల్ మ్యాచ్ రెండో రోజు కృష్ణా జట్టుపై గుంటూరు జట్టు 98 పరుగులు ఆధిక్యం సాధించింది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. తొలి ఇన్నింగ్స్ తొలి రోజు ఆటలో కృష్ణా జట్టు 195 పరుగులకు ఆలౌట్ అయింది. గుంటూరు జట్టు 48.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేసింది. రెండో రోజు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు 93.4 ఓవర్లలో 369 పరుగులు చేసి ఆలౌటైంది. గుంటూరు బ్యాట్స్‌మెన్ కేపీ సాయి రాహుల్ 83, సూర్యవంశీ 55 , నితేష్ బాబు 54 పరుగులు చేశారు. కృష్ణా జట్టు బౌలర్లు ఆర్‌డీ సురేష్ బాబు, టి.శివకుమార్ చెరో మూడు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 24 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 76 పరుగులు చేసింది. కృష్ణా బ్యాట్స్‌మెన్ శ్యాంప్రసాద్ 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. గుంటూరు బౌలర్ కె. మహీప్ కుమార్ ఒక వికెట్ తీశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి గుంటూరు జట్టు 98 పరుగులు ఆధిక్యంలో ఉంది.

ఆఫ్రికన్ వైద్యనిపుణులకు మోకీలు మార్పిడిపై శిక్షణ



అంగోలా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి



ఆపరేషన్ చేయించుకున్న రోగి, వారి బంధువులతో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అరుదైన ఘనతను సాధించారు. విదేశాల్లో మోకీలు మార్పిడి ఆపరేషన్లు స్వయంగా చేసి విదేశీయులకు గుంటూరులో ఈ తరహా సర్జరీలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన శనివారం మీడియాకు వెల్లడించారు. ఆఫ్రికన్ దేశాలలో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజులు పర్యటించినట్లు చెప్పారు. అంగోలా దేశ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పాల లుటుకుట ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలిసారిగా రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీ నిర్వహించామన్నారు. నాలుగు రోజులపాటు అక్కడి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. వారి సూచన మేరకు యువ వైద్యులకు గుంటూరులోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లపై శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనుందని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి వెల్లడించారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్



పొన్నూరు: మహిళను హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పి.భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 3వ వార్డు ఎరుకల వాడకి చెందిన పిట్ట హిమబిందు పేరిట ఉన్న ఇంటి స్థలాన్ని విక్రయించి రూ. 3 లక్షలు ఇవ్వాలని భర్త నాగేంద్రకుమార్ రెడ్డి వేధించేవాడు. ఆమెకు వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని కూడా అనుమానించేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీన హిమ బిందును కత్తితో పొడిచాడు. దీనికి అత్త పిట్ట రమాదేవి సహకరించింది. వెంటనే చికిత్స కోసం ఆమెను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ముందుగా ప్రమాదవశాత్తు హిమబిందు గాయపడినట్లు తెలిసిందని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఆమె హత్యకు గురైనట్లు తేలిందని సీఐ చెప్పారు. దర్యాప్తు తర్వాత నాగేంద్రకుమార్ రెడ్డి, పిట్ట రమాదేవిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

బాలుడిపై కిడ్నాప్ కేసు

ప్రత్తిపాడు: బాలికను అపహరించిన బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. ప్రత్తిపాడు మండలం గనికపూడికి చెందిన బాలిక (17) ఈనెల 3న అదృశ్యమైనట్లు ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ నాగేంద్ర తన సిబ్బందితో గాలించారు. బాలికను నరసరావుపేటలో గుర్తించారు. ఆమె చెప్పిన వివరాలతో అదే గ్రామానికి చెందిన బాలుడిపై కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం బాల నేరస్తుల కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మంచి సినిమాలకు ప్రోత్సాహమే ఎఫ్ఎఫ్ఎస్ఐ లక్ష్యం



ప్రకాష్‌రెడ్డిని సత్కరించిన వీరనారాయణ, కృష్ణ

తెనాలి: మంచి సినిమాలను ప్రోత్సహించటమే ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఎస్ఐ) లక్ష్యమని ఆ సంస్థ సదరన్ రీజియన్ కార్యదర్శి బీహెచ్ఎస్ఎస్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ నెల 31, సెప్టెంబరు ఒకటో తేదీల్లో పుణెలో జాతీయస్థాయి ఫిల్మ్ సొసైటీల సమావేశం జరగనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం స్థానిక తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ సభ్యులను కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఫిల్మ్ సొసైటీల ఏర్పాటును ప్రోత్సహించటం, దేశవిదేశాల నుంచి మంచి సినిమాలను ఎంపిక చేసుకుని సొసైటీల్లో వాటిని ప్రదర్శించటం, సినీ ప్రముఖులతో చర్చాగోష్ఠులు, ఓపెన్‌ఫోరమ్‌ల నిర్వహణ, ఫిల్మ్ అప్రిసియేషన్ కోర్సుల నిర్వహణ ఎఫ్ఎఫ్ఎస్ఐ తరపున కార్యక్రమాలుగా గుర్తుచేశారు. షార్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీలను తీసేందుకు తగిన పద్ధతులను తెలియజేస్తామని చెప్పారు. పెద్ద నగరాలే కాకుండా, చిన్న పట్టణాల్లోనూ ఫిల్మ్ క్లబ్‌లను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. సమాజానికి సందేశాన్నిచ్చే మంచి సినిమాలను నిర్మాతలు తీసేలా కార్యాచరణను రూపొందించుకుంటామని తెలిపారు. ఇక నుంచి తెనాలిలో ప్రతి నెలలో రెండు దేశ/విదేశీ చిత్రాల ప్రదర్శన, నవంబరులో మూడు రోజులపాటు అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు షార్ట్‌ఫిల్మ్ రూపకల్పనపై మెలకువలు తెలిపేందుకు వర్క్‌షాపు ఏర్పాటుకు నిర్ణయించినట్టు చెప్పారు. ఇందుకు కావాల్సిన సినిమాలు, కార్యాచరణ ప్రణాళికకు తోడ్పాటు ఇస్తామని తెలిపారు. ప్రకాష్‌రెడ్డి సేవలకు గాను ఆయన్ను తెనాలి కల్చరల్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణ, కార్యదర్శి బొల్లిముంత కృష్ణలు సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సమరశీల కార్యకర్తలే యూటీఎఫ్ బలం



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన జోజయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమంలో క్రమ శిక్షణ, సమరశీలత కలిగిన కార్యకర్తల వల్లే రాష్ట్రంలో యూటీఎఫ్ ప్రథమ స్థానంలో నిలిచిందని ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కొండవీటి జోజయ్య అన్నారు. శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్‌లు సంయుక్తంగా నేతృత్వం వహించారు. ముఖ్య అతిథిగా యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జోజయ్య మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలను యూటీఎఫ్ నిర్వహిస్తోందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత యూటీఎఫ్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన స్తూపం వద్ద సంఘం కోసం జీవితాలను త్యాగం చేసిన అమరులకు నివాళులు అర్పించారు. స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్ కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల విభాగ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు, సీనియర్ నాయకులు కేఎస్వీ దుర్గారావు, జి.ప్రభుదాస్, ఎన్. తాండవ కృష్ణ, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివ పార్వతి, జిల్లా కోశాధికారి ఎండీ గయా సుదౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం. గోవిందయ్య, జీవీ ధనలక్ష్మి, కె. కేదార్ నాథ్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్, కె.ప్రభూజీ, జి. జితేంద్ర షకీలా పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ



విద్యార్థుల రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ విజయలక్ష్మి



3కే రన్‌లో పరుగులు తీస్తున్న విద్యార్థినులు

గుంటూరు మెడికల్: అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ సాధ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. శనివారం వివిధ కాలేజీల విద్యార్థులు, ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు విద్యార్థినులకు 3కే రన్, విద్యార్థులకు 5కే రన్ నిర్వహించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఈ రన్ జరిగింది. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు చిల్లీస్ హోటల్ నుంచి ఆర్‌టీఓ ఆఫీసు వరకు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... హెచ్ఐవీ సోకిన వారిని వివక్షతో చూడొద్దన్నారు. సక్రమంగా మందులు వాడేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు , జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్ ప్రసంగించారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శ్యామ్‌సన్ ఈ సందర్భంగా విజేతలతో పాటు పాల్గొన్న విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరస్వామి, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, మానిటరింగ్ ఆఫీసర్ శ్రీవిద్య, జిల్లా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జె.వి.సుధీర్, టీజేపీఎస్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్.శివాజీ, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ కె.రత్నకుమార్, వీహెచ్ఎస్, కొత్తపేట మహిళా మండలి, సిరి మహిళ సాధికారక వెల్ఫేర్ సొసైటీ, జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, ఐసీటీసీ, ఏఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 14 మంది ఎస్ఐలు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో 14 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి రూరల్ పీఎస్ ఎస్ఐగా సీహెచ్.వెంకటేశ్వర్లు, దుగ్గిరాలకు ఎస్.వెంకటరవి, ప్రత్తిపాడుకు కె.నాగేంద్ర నియమితులయ్యారు. పట్టాభిపురం ఎస్ఐ పృథ్వీఏక్‌నాథ్‌ను కాకుమానుకు, జిల్లా వీఆర్‌లో ఉన్న డి.వెంకటకృష్ణను చేబ్రోలుకు, పి.సుబ్బారావును అరండల్‌పేటకు బదిలీ చేశారు. అరండల్‌పేట నుంచి టి.నాగరాజు, మేడికొండూరు నుంచి చల్లా వాసు, ఫిరంగిపురం నుంచి పి.వీరనారాయణలను నల్లపాడు పీఎస్‌కు ఎస్ఐలుగా పంపారు. కాకుమాను నుంచి ఎస్.రవీంద్ర, చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్, నల్లపాడు నుంచి కె.ఏడుకొండలు, వై.సత్య నారాయణ, జంజం శ్రీనివాసరావులను జిల్లా వీఆర్‌కు పంపించారు.

15 నుంచి బీజేపీ 'వారధి'

గుంటూరు మెడికల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీ నుంచి వినతులు స్వీకరించేందుకు బీజేపీ నిర్ణయించింది. పార్టీ ప్రజా ప్రతినిధులు విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఈ మేరకు వారధి కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ చెప్పారు.